సాక్షి మెదక్

గురువారం । 4 । ఏప్రిల్ । 2024



'విజిల్' వేద్దాం

ఎన్నికల్లో జరిగే అక్రమాలు, ఉల్లంఘనలపై ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం రూపొందించిన సీ–విజిల్ యాప్ పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రంగా ఉపయోగపడనుంది. వివరాలు 8లో ▸



కాలానుగుణంగా బోధనలో

డిజిటల్ వినియోగం ద్వారా బోధన కొత్త పుంతలు తొక్కుతోందని, కాలానుగుణంగా బోధనలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని బీసీ గురుకులాల సొసైటీ రాష్ట్ర కార్యదర్శి సైదులు అన్నారు. వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
గురువారం (సాయంత్రం)	శుక్రవారం (ఉదయం)
06:35	04:45

న్యూస్‌రీల్

సజావుగా ధాన్యం కొనుగోళ్లు
అదనపు డీఆర్డీఓ సరస్వతి



సలాబత్‌పూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సరస్వతి

కౌడిపల్లి(నర్సాపూర్): రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా సరైన చర్యలు చేపట్టాలని అదనపు డీఆర్డీఓ సరస్వతి అన్నారు. బుధవారం ఆమె, డీపీఎం మోహన్‌తో కలసి కౌడిపల్లి మండలం సలాబత్‌పూర్, కొత్తపల్లి, పీర్లతండా, కొట్టాల, పీరియా తండా, కుకుట్లపల్లి గ్రామాలలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు తక్కువ రేటుకు అమ్ముకొని నష్టాల పాలు కావొద్దన్నారు. కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ర్యాం సంగమేశ్వర్, ఏఓ స్వప్న, ఏఈఓ రాజశేఖర్, సీసీలు నాగరాజు, శ్రీకాంత్, వీఓఏలు స్వాతి, స్వప్న, దేవయ్య, సామెల్, లలిత, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో విద్యుత్ సిబ్బంది
ట్రాన్స్‌కో ఎస్ఈ జానకిరాములు



మెదక్: పట్టణంలో విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం 24 గంటల పాటు ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఆఫీసులో తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని ట్రాన్స్‌కో ఎస్ఈ జానకిరాములు తెలిపారు. ప్రస్తుతం అకాల వర్షాలు, గాలిదుమారంతో కూడిన వానలు పడితే విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని, వెంటనే పునరుద్ధరించేందుకు తమ సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉంటారన్నారు. విద్యుత్ సమస్య ఉత్పన్నమైతే వెంటనే 08452–222382 లేదా 7382616080 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

పరిశ్రమవాడను సందర్శించిన టీఎస్ఐఐసీ ఎండీ

మనోహరాబాద్(తూప్రాన్): కొండాపూర్ ఐలా పారిశ్రామికవాడను టీఎస్ఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం సందర్శించారు. పలు పరిశ్రమలను సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. పరిశ్రమల వాడకు సబ్‌స్టేషన్, అప్రోచ్ రోడ్డు సమస్యలను ఆరు నెలలోపు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నూతనంగా టీఎస్ఐఐసీ ఎండీగా బాధ్యతలు చేపట్టిన విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఐఐసీ సీఈఓ మధుసూదన్, జెడ్ఎం మాధవి, పరిశ్రమలవాడ ప్రధాన కార్యదర్శి జి.వి.సుబ్రమణ్యం, సంయుక్త కార్యదర్శి సాంబశివరావు, ఉపాధ్యక్షులు శ్రీకాంత్, కోశాధికారి అశోక్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ సభ్యులు సత్యనారాయణ, నవనీత్‌కుమార్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన సంగమేశ్వర్‌రెడ్డి



పార్టీలో చేరుతున్న సంగమేశ్వర్‌రెడ్డి

నారాయణఖేడ్: నిజాంపేట్ మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సంగమేశ్వర్‌రెడ్డి బుధవారం ఢిల్లీలో బీజేపీలో చేరారు. ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జి తరుణ్ చుగ్ సమక్షంలో కాషాయం తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సంగమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ దేశపురోభివృద్ధి, అన్నివర్గాల సంక్షేమం మోదీతోనే సాధ్యమైనందున తాను ఈ పార్టీలో చేరానని తెలిపారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో జహీరాబాద్‌లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్, పార్లమెంట్ పార్టీ కన్వీనర్ రవికుమార్ గౌడ్ పాల్గొన్నారు.

పని దినాలు ఉపయోగించుకోవాలి

ఝరాసంగం(జహీరాబాద్): ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రభుత్వం కల్పించిన పూర్తి పని దినాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఓ ఎం.జ్యోతి కూలీలకు సూచించారు. బుధవారం మండల పరిధి కుప్పానగర్ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆమె పర్యవేక్షించారు. రికార్డులు పరిశీలించి కూలి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి పనులు కల్పిస్తామన్నారు. దినసరి కూలి రూ. 272 నుంచి రూ.300కు పెంచడం జరిగిందన్నారు. కూలీల సంఖ్య పెంచాలని అధికారులను ఆదేశించారు. ఆమె తోపాటు ఎంపీడీఓ సుధాకర్, ఏపీఓ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మృత్యుఘోష

- ఎస్.బీ.ఆర్గానిక్స్ పరిశ్రమలో రియాక్టర్ పేలుడు
- ఎగసిపడిన అగ్నికీలలు, అలుముకున్న పొగలు
- చెల్లాచెదురైన మృతదేహాలు
- గుట్టలుగా పేరుకు పోయిన శిథిలాలు
- ఘటనా స్థలం వద్ద భీతావహ దృశ్యాలు



ఆర్గానిక్స్ పరిశ్రమలో ప్రమాద దృశ్యాలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి/ హత్నూర : ఎగసిపడిన అగ్నికీలు.. దట్టంగా అలుముకున్న పొగలు.. పేలుడు ధాటికి ధ్వంసమైన భవనాలు.. గుట్టలుగా పేరుకు పోయిన శిథిలాలు.. చెల్లా చెదురైన కార్మికుల మృతదేహాలు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్‌లోని ఎస్.బీ.ఆర్గానిక్స్ పరిశ్రమలో బుధవారం సాయంత్రం జరిగిన రియాక్టర్లు పేలడంతో భీతావహ వాతావరణం నెలకొంది. పరిశ్రమలోని ఆయిల్ రియాక్టర్ పేలి మంటలు అంటుకున్న ఈ ఘటనలో మృతుల సంఖ్య ఐదుకు చేరగా, సుమా 30 మందికి పైగా గాయాలపాలయ్యారు. మృతులు వివిధ రాష్ట్రాలకు చెందిన వారుగా గుర్తించారు. ఆయిల్ రియాక్టర్ పేలడంతో కార్మికుల మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఫ్యాక్టరీ పేలిపోయి భవన శిథిలాల కింద పడిపోయాయి. మృతదేహాలు కొన్ని నుజ్జునుజ్జయ్యాయి. ఘటనా స్థలంలో హృదయవిదారక వాతావరణం నెలకొంది. దట్టమైన పొగలు కమ్ముకోవడంతో పాటు, అగ్నికీలలు ఎగసిపడ్డాయి. పేలుడు ధాటికి సుమారు 200 మీటర్ల వరకు ఉన్న భవనాలు, ఫ్యాక్టరీల షెడ్లు నేలమట్టమయ్యాయి. శిథిలాలు చెల్లాచెదురైపోయాయి. ఫ్యాక్టరీ ఆవరణలో ఉన్న భవనాల్లోని అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసమయ్యాయి. ఫ్యాక్టరీలో సుమారు 200 మంది కార్మికులుండగా.. ఘటన జరిగిన షిఫ్టులో 60 మంది పని చేస్తున్నారు. పేలుడు సంభవించిన వెంటనే కార్మికులు, ఉద్యోగులు హాహాకారాలు చేస్తూ పరుగులు తీశారు. కమ్ముకున్న పొగతో ఎటు వెళ్లాలో తెలియక ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు, సిబ్బంది మంటలను ఆర్పి అదుపులోకి తెచ్చారు.

పరిహారానికి కోడ్ అడ్డంకి: మంత్రి కొండా సురేఖ

ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలతో పాటు గాయపడిన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది. ఎన్నికల కోడ్ ఉన్నందున ఎంత నష్టపరిహారం ఇచ్చేది ప్రభుత్వం ప్రస్తుతం ప్రకటించలేదు. కలెక్టర్‌తో పాటు ఎస్పీలను పూర్తి స్థాయి విచారణ చేయాలని ఆదేశించాం. పరిశ్రమలో కార్మికులకు భద్రతా సౌకర్యాలు కల్పించే విధంగా పరిశ్రమ యాజమాన్యాలు చర్యలు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం. ఈ ఘటనలో కార్మికుల మృతిచెందడం బాధాకరం.

సీఎం దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటాం: మంత్రి దామోదర

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబాలను ఆదుకుంటాం. కార్మికులకు తగిన భద్రతా చర్యలు చేపట్టకపోవడం వల్లే ప్రమాదాలు సంభవించినప్పుడు కార్మికులు మరణిస్తున్నారు. అగ్నిప్రమాద ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తాం. అందుకు గల కారణాలను తెలుసుకొని తదుపరి చర్యలుంటాయి.

ఒక్కొక్కరికీ కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు

ప్రమాదంలో మృతిచెందిన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం కోటి రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలి. పరిశ్రమలో కార్మికులకు సేఫ్టీ ప్రికాషన్స్ లేకపోవడం వల్లే ప్రమాదం సంభవించి మృతిచెందారు. కాలం చెల్లిన రియాక్టర్ల వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నా.. తనిఖీ చేసే జిల్లా అధికారులు పట్టించుకోవడంలేదు. నెల క్రితం ఇదే మండలం గుండ్లమాచనూరు గ్రామ శివారు కోవలెంట్ పరిశ్రమంలో కూడా రియాక్టర్ పేలి నలుగురు కార్మికులు మృతిచెందినా అధికారులు కళ్లు తెరవక పోవడం విచారకరం. తాజా ప్రమాద విషయమై ప్రధాని మోదీకి మెయిల్ ద్వారా సమాచారం పంపాను. కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా సహాయం అందించేలా చర్యలు తీసుకుంటాం.

తనిఖీ చేస్తే ఘటనలు జరగవు : ఎమ్మెల్యే సునీతారెడ్డి

మృతిచెందిన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలి. గాయాలైన ప్రతి కార్మికునికీ మెరుగు వైద్యం అందించాలి. కార్మికులకు భద్రత కరువైంది. ప్రమాదాలు సంభవించినప్పుడు వారే బలవుతున్నారు. పరిశ్రమలను ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి అధికారులు తనిఖీ చేస్తే ఇలాంటి సంఘటనలు జరగవు.



వివరాలు తెలుసుకుంటున్న సునీతారెడ్డి

ఘటనా స్థలానికి ప్రముఖులు

అగ్నిప్రమాదం ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహ, కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ చెన్నూరి రూపేష్ ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలును పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, బీజేపీ మెదక్ అభ్యర్థి రఘునందన్‌రావు, సంగారెడ్డి డీసీసీ అధ్యక్షురాలు నిర్మలారెడ్డి తదితరులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

తాగునీటి ఎద్దడి ఉండొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించండి
- ఓటు హక్కుపై విస్తృత ప్రచారం చేయాలి
- మొదటి విడత రాండమైజేషన్ ప్రక్రియ పూర్తి
- ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్
- జిల్లా అధికారులతో పలు సమావేశాలు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని ఏ ఒక్క గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం కలెక్టర్ జిల్లాలోని పలు సమస్యలపై విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించారు. ముందుగా తాగునీటి సమస్య పరిష్కారం, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలపై జిల్లాలోని తహసీల్దార్లు, ప్రత్యేక అధికారులు, వ్యవసాయ, ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. తాగు నీటి నివారణకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించి, తగు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. అనంతరం కలెక్టర్ తన చాంబర్‌లో ఓటు హక్కు అవగాహనపై స్వీప్ అధికారులకు సూచనలు చేశారు. అలాగే నర్సాపూర్, మెదక్‌లోని పీఓ, ఏపీఓల శిక్షణ కేంద్రాలను సందర్శించి పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా పలు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంల మొదటి రాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. నియోజక వర్గాల వారీగా సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి , పటాన్‌చెరువులకు కేటాయించిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ల మొదటి ర్యాండమైజేషన్ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజక వర్గాలకు 584 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి మొత్తం బ్యాలెట్ యూనిట్లు 729, కంట్రోల్ యూనిట్స్ 729 (125 శాతం), వీవీప్యాట్స్ 816 (140 శాతం)ల మొదటి విడత ర్యాండమైజేషన్‌లో కేటాయించామన్నారు. సమావేశాల్లో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్, డీఎంహెచ్ఓ శ్రీరామ్, డీపీఓ యాదయ్య, స్వీప్ అధికారి రాజిరెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, జెడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా సంక్షేమ అధికారి బ్రహ్మజీ, ఆర్డీఓ రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

- తాగునీరు సమస్యలు ఉంటే సమాచారం ఇవ్వాలి
- అదనపు కలెక్టర్ రమేశ్



డీపీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూం

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం కంట్రోల్ రూం, టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ రమేశ్ తెలిపారు. మెదక్ సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో కంట్రోల్‌రూం (9391942254) ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు గ్రామ పంచాయతీలకు 9500040589, మున్సిపాలిటీలకు 7396907444 , మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు గ్రామ పంచాయతీలకు 7702824957 , మున్సిపాలిటీలకు 9381369485 నంబర్లలో అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలలో మున్సిపాలిటీలు, అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఎక్కడైనా తాగునీరు సమస్యలుంటే ఈ నంబర్లకు సమాచారం ఇవ్వాలని అదనపు కలెక్టర్ కోరారు. అధికారులు ఫిర్యాదులపై తక్షణం స్పందించడమే కాకుండా సంబంధిత అధికారులకు తెలిపి సమస్య పరిష్కరిస్తారని తెలిపారు.

నెలకే 'తారు'మారు



తారు లేచిపోతున్న దృశ్యం

- నాసిరకం పనులతో దెబ్బతిన్న రోడ్డు
- రైల్వేస్టేషన్ ఆవరణలో పరిస్థితి ఇదీ..

రామాయంపేట(మెదక్): తారు రోడ్డు నిర్మించిన నెల రోజులకే పాక్షికంగా పాడైపోయింది. రోడ్డు వేయక ముందే బాగుండేదని ఇప్పుడు పాక్షికంగా శిథిలమైందని ప్రయాణికులు ఆరోపించారు. అక్కన్నపేటలో రైల్వేస్టేషన్ ముందు భాగంలోని ఆవరణలో ఇంతకు ముందు మట్టి రోడ్డు ఉండేది. దీనిని తారురోడ్డుగా మార్చడానికి గాను ఆశాఖ నుంచి సుమారుగా రూ. పది లక్షలు మంజూరయ్యాయి. నెల రోజుల క్రితం కాంట్రాక్టర్ పనులు ప్రారంభించాడు. ముందుగా రోడ్డుపై పూర్తిస్థాయిలో మట్టి తొలగించి కంకర తొక్కించి తారు వేయాలి. కానీ మట్టి సరిగ్గా తొలగించనే లేదు. హడావిడిగా తారు వేసి చేతులు దులుపుకున్నట్లు ఆరోపణలున్నాయి. నెలకే రోడ్డు మూలల వద్ద లెవల్ చేయలేదు కుప్పలుగా పోసి వదిలేశారు. చాలా చోట్ల కంకర తేలింది. సంబంధిత కాంట్రాక్టర్ నాసిరకంగా నిర్మించి చేతులు దులుపుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ విషయమై ఆశాఖకు చెందిన ఇంజినీరింగ్ అధికారిని ఫోన్‌లో సంప్రదించగా అక్కన్నపేట స్టేషన్ ఎదుట తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరుకాగా, సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డు నిర్మించారన్నారు. పాక్షికంగా పాడైన విషయం తన దృష్టికి రాలేదన్నారు. రోడ్డు పాడైతే గ్యారంటీ పీరియడ్ కింద అతనే మళ్లీ రిపేర్ చేపట్టాల్సి ఉందన్నారు. ఎక్కువ లోడు లారీలు, ఇతర వాహనాలు తిరిగితే తారు లేచిపోయే అవకాశం ఉందన్నారు.



దాకూర్‌లో ప్రార్థనలు చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

ఆత్మీయతకు ప్రతీక ఇఫ్తార్

పవిత్రమైన రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయతకు ప్రతీక అని వైద్య ఆరోగ్య సంక్షేమశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ చైర్మన్ తూర్పు నిర్మలారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వారు అందోలు మండల పరిధిలోని దాకూర్ గ్రామం, సదాశివపేట పట్టణంలోని సిద్దాపూర్ కాలనీలో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

–వట్‌పల్లి(అందోల్)/సదాశివపేట(సంగారెడ్డి)

22న వ్యాస రచన పోటీలు

జిన్నారం(పటాన్‌చెరు): ఈనెల 22న ఎర్త్‌డే సందర్భంగా 6 నుంచి 12వ తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు స్కోప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఉప్పలయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'భూమండలాన్ని ప్లాస్టిక్ రహితం చేసేందుకు ఏం చేయాలి (ప్లానెట్ వర్సెస్ ప్లాస్టిక్)' అనే అంశంపై వ్యాసం రాయాల్సి ఉంటుందని చెప్పారు. ఉత్తమ వ్యాసానికి నగదు బహుమతి తోపాటు ప్రశంసా పత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు 9849455481 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

కోర్టు భవనం పరిశీలించిన న్యాయమూర్తి



అల్లాదుర్గం నూతన కోర్టు భవనాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి లక్ష్మీశారద

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గంలో ఏర్పాటు చేయనున్న కోర్టు భవనాన్ని బుధవారం జిల్లా న్యాయమూర్తి లక్ష్మీశారద పరిశీలించారు. సాంఘిక సంక్షేమ శాఖ బాలిక వసతి గృహంగా ఉన్న భవనాన్ని కోర్టుకు కేటాయించారు. మరమ్మతు పనులు చేపట్టారు. వాటిని పరిశీలించి పలు సూచనలు చేశారు. అల్లాదుర్గంలో త్వర లో కోర్టు ప్రారంభం కానుంది. న్యాయమూర్తి వెంట సీఐ రేణుక, తహసీల్దార్ సతీశ్, సీనియర్ లాయర్ విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనబడికి నిధుల గ్రహణం

- రూ. 9.77 కోట్ల బకాయిలు
- బిల్లుల కోసం కాంట్రాక్టర్ల ఎదురుచూపు
- 313 పాఠశాలల్లో 40 మాత్రమే పూర్తి
- నిధుల్లేక పనులకు బ్రేక్



మాసాయిపేటలో నిధులు రాకపోవటంతో అర్ధంతరంగా నిలిచిన పాఠశాల భవనం

మెదక్‌జోన్: ప్రభుత్వ పాఠశాలలను సకల వసతులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది.. ప్రైవేటుకు దీటుగా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు గత ప్రభుత్వం మనఊరు –మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ద్వారా పాఠశాలల్లో చేపట్టిన పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఏడాదిగా బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు.

313 పాఠశాలల ఎంపిక

జిల్లావ్యాప్తంగా 823 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిల్లో మొదటి విడత మరమ్మతుల కోసం 2022లో 313 పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ బడుల్లో మరమ్మతులతో పాటు అదనపు తరగతి గదుల నిర్మాణం, తాగునీటి సమస్య పరిష్కారం, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్లు, కిచెన్‌షెడ్ల నిర్మాణాలు, ప్రహరీ, హైస్కూళ్లలో డైనింగ్ హాళ్ల నిర్మాణాలు చేపట్టాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం మొదటి విడతలో రూ.132 కోట్లు అవసరం ఉండగా రూ.66 కోట్లు మన ఊరు– మనబడి పథకం ద్వారా, మరో రూ.66 కోట్లు ఎన్ఆర్ఈజీఎస్ కింద నిధులు మంజూరయ్యాయని అధికారులు చెప్పారు. కానీ వాటి మంజూరులో జాప్యం జరగడంతో సదరు కాంట్రాక్టర్లు పనులు చేయడం మానేశారు.

40 పాఠశాలల్లో పూర్తి

313 పాఠశాలలు మరమ్మతు పనులు ప్రారంభించారు. అందులో కేవలం 40 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. ఇంకా 273 పాఠశాలల్లో వివిధ దశల్లో నిర్మాణాలు నిలిచి పోయాయి. మొత్తం పాఠశాలల్లో సదరు కాంట్రాక్టర్లకు రూ.36.77 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉండగా.. రూ.27 కోట్ల నిధులు మాత్రమే మంజూరయ్యాయి. ఈ లెక్కన ఇంకా రూ.9.77 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది.

రూ.8 లక్షలు రావాలి



చిన్నశంకరంపేట మండల మాందాపూర్ గ్రామంలోని పాఠశాలలో అదనపు తరగతి నిర్మాణంతో పాటు ప్రహరీ నిర్మాణం, మైనర్ రిపేర్లు, తాగు నీటి సౌకర్యం కోసం రూ.21లక్షలు మంజూరయ్యాయి. చేసిన పనులకు రూ.13 లక్షలు మాత్రమే వచ్చాయి. ఇంకా రూ.8లక్షలు రావాల్సి ఉంది. ఇప్పటికీ ఏడాది అవుతున్నా రావటం లేదు.

– భిక్షపతి, మాజీ సర్పంచ్, మాందాపూర్

రూ. 9.77 కోట్ల బకాయిలు రావాలి

మన ఊరు– మనబడి పథకం 2022లో ప్రారంభం కాగా 313 పాఠశాలలు మొదటి విడతలో ఎంపిక చేశాం. వాటిలో 40 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఆగిపోయాయి. కాంట్రాక్టర్లకు రూ. 36.77 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇప్పటివరకు రూ. 27 కోట్లు మాత్రమే వచ్చాయి.

– రాధాకిషన్, డీఈఓ మెదక్

క్లుప్తంగా

కాటా ఇంటికి మంత్రి కొండా సురేఖ

నీలం గెలుపునకు కృషి చేయాలని సూచన



కాటా శ్రీనివాస్‌ నివాసంలో కొండా సురేఖ

పటాన్‌చెరు టౌన్‌: పటాన్‌చెరు నియోజకవర్గం కాంగ్రెస్‌ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌ గౌడ్‌ నివాసానికి బుధవారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి, మెదక్‌ పార్లమెంట్‌ ఇన్‌చార్జి కొండా సురేఖ, మెదక్‌ కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌తో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా కాటా శ్రీనివాస్‌ గౌడ్‌తో సమావేశమై వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో నీలం మధు గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్‌కి అత్యధిక మెజార్టీ వచ్చే విధంగా కలిసి పని చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కాట శ్రీనివాస్‌ గౌడ్‌ మాట్లాడుతూ... పార్టీ ఆదేశాలకు అనుగుణంగా నీలం మధు గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని వెల్లడించారు.

నీటి నిర్వహణ ప్రత్యేక అధికారిగా హోళికేరి



సాక్షి, సిద్దిపేట: జిల్లాలో రోజు రోజుకూ ఎండలు మండిపోతున్నాయి, ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి, దీంతో సాగు, తాగు నీటికి ఇబ్బందుల తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. అందులో భాగంగా నీటి నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఐఏఎస్‌ అధికారులను నియమించారు. ఈ మేరకు ఉమ్మడి మెదక్‌ జిల్లాకు ఆర్కియాలజీ డైరెక్టర్‌ భారతి హోళికేరిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు బుధవారం జారీ చేశారు. గతంలో ఉమ్మడి మెదక్‌లో కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు.

జాతీయ పోటీల్లో సత్తా



శ్రీహర్ష

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): జాతీయ స్థాయి యోగాసన పోటీల్లో విద్యార్థి శ్రీహర్ష సత్తా చాటడంపై మండల పరిధిలోని అంగడి కిష్టాపూర్‌కు చెందిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఓంకార్‌ రాధాకృష్ణ, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. జగదేవ్‌పూర్‌ మండలం తిగుల్‌ గ్రామానికి చెందిన శ్రీహర్ష నాలుగో తరగతి వరకు అంగడి కిష్టాపూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలలో చదివాడని, అనంతరం కరీంనగర్‌లోని స్పోర్ట్స్‌ స్కూల్‌కు ఎంపికై ప్రస్తుతం అక్కడ 5వ తరగతి చదువుతున్నట్లు తెలిపారు. ఇటీవల నేషనల్‌ లెవల్‌ యోగాసనా చాంపియన్‌ షిప్‌ 2023–24 పోటీల్లో జాతీయ స్థాయిలో మొదటి స్థానం సాధించినట్లు పేర్కొన్నారు.

ప్రతీ ఫ్రేమ్‌కి లైటింగ్‌ కీలకం



మాట్లాడుతున్న జగదీశ్‌

పటాన్‌చెరు: సినిమా ఫొటోగ్రఫీలో లైటింగ్‌ కీలక భూమిక పోషిస్తుందని, ప్రతీ ఫ్రేమ్‌కు లైటింగ్‌ ఆత్మగా పని చేస్తుందని, కథను చెప్పడంలో సహకరిస్తుందని ప్రముఖ ఫొటోగ్రఫీ డైరెక్టర్‌ (డీవోపీ), వర్చువల్‌ సినిమాటోగ్రాఫర్‌ జగదీశ్‌ బొమ్మిశెట్టి అన్నారు. అవుచర్‌ ఇండియా సహకారంతో గీతం స్కూల్‌ ఆఫ్‌ హ్యూమానిటీస్‌ అండ్‌ సోషల్‌ సైన్స్‌ (జీఎస్‌హెచ్‌ఎస్‌)లోని మీడియా స్టడీస్‌, విజువల్‌ కమ్యూనికేషన్‌ విభాగం ఆధ్వర్యంలో సినిమాటిక్‌ లైటింగ్‌పై బుధవారం ఒకరోజు వర్క్‌ షాప్‌ను నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న జగదీష్‌ చలన చిత్ర నిర్మాణంలో లైటింగ్‌ విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

‘విజిల్‌’ వేద్దాం

పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రంగా ‘సీ- విజిల్‌’

- ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే ఫిర్యాదులు
- ఫొటోలు, వీడియోలు పంపిస్తే చాలు..
- వెంటనే స్పందించనున్న అధికారులు



కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్‌లో సీ-విజిల్‌ ఫిర్యాదులను పరిశీలిస్తున్న పర్యవేక్షకుడు

మెదక్‌ కలెక్టరేట్‌: ఎన్నికల్లో జరిగే అక్రమాలు, ఉల్లంఘనులపై ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం రూపొందించిన సీ-విజిల్‌ యాప్‌ పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రంగా ఉపయోగపడనుంది. లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరారు కావడంతో ప్రచారాన్ని మొదలు పెట్టారు. ఎన్నికల సంఘం సూచించిన నిబంధనలకు లోబడి ప్రచారం జరగాలి. కానీ కొన్ని చోట్ల అభ్యర్థులు, పార్టీలు ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఓటర్లను ఆకట్టుకునేందుకు అనేక గిమ్మిక్కులు చేస్తుంటారు. అలాంటి ఉల్లంఘనులపై చర్యలు తీసుకునేందుకు ఎన్నికల కమిషన్‌ సీ-విజిల్‌ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. మెదక్‌ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ కేంద్రంగా దీన్ని నిర్వహిస్తున్నారు.

ఫొటోలు, వీడియోలు తీసి..

ఎన్నికల ప్రచారంలో భాగంగా అభ్యర్థులు, కార్యకర్తలు నిబంధనలను అతిక్రమించినా, ఇబ్బందులు సృష్టించినా సీ-విజిల్‌ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు. ప్రస్తుతం ఎవరి చేతిలో చూసినా స్మార్ట్‌ఫోన్లు కనిపిస్తున్నాయి. మన కళ్ల ఎదుట జరుగుతున్న ఘటనలను వెంటనే ఫోన్‌ ద్వారా ఫొటోలు, వీడియోలు తీసి ఫిర్యాదు చేయొచ్చు. వంద నిమిషాల్లోపు ఉల్లంఘనలపై అధికారులు చర్యలు తీసుకుంటారు. ఓటర్లను బెదిరింపులకు గురి చేసినా, మారణాయుధాలు కలిగి ఉన్నా, కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టినా, ప్రలోభ పెట్టేలా వస్తువులు, నగదు పంపిణీ చేసినా, ప్రజల ఆస్తులను పాడు చేసినా, మద్యం, మాదక ద్రవ్యాల పంపిణీ జరిగినా, అసత్య వార్తలను ప్రసారం చేసినా, చెల్లింపు వార్తలతో మభ్యపెట్టే ప్రయత్నం చేసినా, ఓటర్లను ఉచితంగా రవాణా చేసినా ఫిర్యాదు చేసేందుకు ఆస్కారం ఉంది.



వినియోగం ఇలా..

- ఈ యాప్‌ను సెల్‌ఫోన్‌లోని ప్లే స్టోర్‌ నుంచి డౌన్‌లోడ్‌ చేసుకోవాలి.
- ఘటనా స్థలి నుంచి మాత్రమే ఫిర్యాదు పంపించాలి. ఇతరులు పంపించిన వాటిని తిరిగి పంపించొద్దు.
- ఒక చోట ఉండి ఇతర ప్రాంతంలో జరిగిన ఘటనలు పంపితే ప్రయోజనం ఉండదు.
- ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతారు.

ప్రతీ మండలానికి క్షేత్ర బృందాలు..

ఎన్నికల నియమావళి, వ్యయ ఉల్లంఘన ఘటనలు చూసినప్పుడు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాలి. అనంతరం వాటిని సీ-విజిల్‌ యాప్‌లో నమోదు చేయాలి. అలా పంపిన దృశ్యాలను అధికారులు పరిశీలించి నిర్ధారణ కోసం క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం అందిస్తారు. నిర్దేశిత సమయం లోపు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుంటారు. అక్కడ సమాచారాన్ని సేకరించి ఉన్నతాధికారులకు సమర్పిస్తారు. అనంతరం నిజానిజాలు నిర్ధారణ చేసి బాధ్యులపై ప్రజలు ఫిర్యాదు చేసిన వంద నిమిషాల్లోనే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటారు. ఇందుకోసం ప్రతీ మండలానికి ప్రత్యేకంగా క్షేత్ర బృందాలను సైతం ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించారు. వీరంతా అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ వచ్చే ఫిర్యాదులను పరిశీలించడం, తదుపరి చర్యలు తీసుకుంటారు.

“ అందరూ స్పందించాలి



పారదర్శక సేవలు అందించేందుకు, అవినీతిని నియంత్రించడానికి ఏర్పాటు చేసిన సీ-విజిల్‌ యాప్‌ను నిర్లక్ష్యం చేయొద్దు. అన్యాయం, అక్రమాలు జరిగిన వెంటనే స్పందించి ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదులను మూడు విభాగాలు డ్రాప్‌, డిస్పోజ్‌, ఎస్కలేట్‌లుగా చూడటం జరుగుతుంది. ఫిర్యాదు అందిన వెంటనే ఘటన జరిగిన పరిధిలో ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ టీమ్‌ను అలర్ట్‌ చేయడం జరుగుతుంది. అక్కడికి చేరుకున్న టీం వివరాలు సేకరించి సంబంధిత అసిస్టెంట్‌ ఎన్నికల అధికారి (ఆర్డీఓ)కి సమాచారం అందజేస్తారు. వాటిని పరిశీలించిన అధికారి ఫేక్‌ న్యూస్‌ అయిత్‌ డ్రాప్‌ చేస్తారు. నిజంగానే ఘటన జరిగినట్లు రుజువైతే చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదు చేస్తారు.

– రాహుల్‌రాజ్‌, జిల్లా ఎన్నికల అధికారి

మేము ప్రాజెక్టులు నిర్మిస్తే.. మీరు నీళ్లు ఇవ్వరా..?

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, పక్కన బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

దుబ్బాక: శాశ్వతంగా కరువును దూరం చేసేందుకు మేము ప్రాజెక్టులు నిర్మిస్తే.. కాంగ్రెస్‌ ప్రభుత్వం కనీసం నీళ్లు విడవడానికే ఆపసోపాలు పడుతుందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం దుబ్బాక పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మెదక్‌ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డితో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పంటలు ఎండిపోతున్నాయి కూడవెల్లి వాగులోకి మల్లన్నసాగర్‌ నీళ్లు వదిలి పంటలు కాపాడాలని మంత్రులకు ఫోన్‌ చేస్తే కనీసం లిఫ్ట్‌ చేయడం లేదన్నారు. దుబ్బాకలో చెల్లని రూపాయి మెదక్‌లో ఎలా చెల్లుతుందని బీజేపీ అభ్యర్థి రఘునందన్‌ రావును ఉద్దేశించి విమర్శించారు.

ప్రజా సేవ కోసమే: వెంకట్రామిరెడ్డి

ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చానని తనను గెలిపిస్తే రూ.100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేసి సేవలందిస్తానని మెదక్‌ బీఆర్‌ఎస్‌ ఎంపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి అన్నారు. దేశ చరిత్రలోనే కలెక్టర్‌గా రాజీనామా చేసి ఎంపీ అభ్యర్థిగా రూ.100 కోట్ల ట్రస్టును ప్రకటించిన ఘనత నాకే దక్కుతుందన్నారు. నేను విజయం సాధించిన 9 నెలల్లో పార్లమెంట్‌ పరిధిలోని 7 నియోజకవర్గాల్లో ఫంక్షన్‌ హాల్‌లు నిర్మిస్తానన్నారు.

సేంద్రియ వ్యవసాయం చేయాలి



జీవాంమృతం తయారు చేయడంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కేవీకే చైర్మన్‌ సుందర్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్‌): ప్రతీ రైతు సేంద్రియ వ్యవసాయం చేయాలని కేవీకే చైర్మన్‌ సుందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం కౌడిపల్లి మండలం తునికి వద్ద గల డాక్టర్‌ డి.రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్‌ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో సాంకేతిక వారోత్సవాల్లో భాగంగా ఎస్సీ రైతులకు మూడవ రోజు ఆధునిక వ్యవసాయం, సేంద్రియ సాగుపై శాస్త్రవేత్తలు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేంద్రియసాగుతో కల్తీలేని ఆహార పంటలు పండుతాయని, నేల ఆరోగ్యం బాగుంటుందన్నారు. అనంతరం ప్రోగ్రామ్‌ ఇన్‌చార్జి, సైంటిస్ట్‌ శ్రీనివాస్‌ మాట్లాడుతూ.. పాత పద్ధతులకు ఆధునికత జోడించి సేంద్రియ సాగు చేయాలన్నారు. పశువుల పేడతో ఘన జీవాంమృతం, ఆవుమూత్రంతో జీవాంమృతం, బీజాంమృతం, వర్మీకంపోస్ట్‌ ఎరువు తయారు చేసి వాడటం వల్ల ఆహార పంటలు బాగుంటాయన్నారు. ఈ సందర్భంగా 70మంది రైతులకు సోలార్‌ దీపపు ఎర లైట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేవీకే హెడ్‌, సైంటిస్ట్‌ నల్కర్‌, శాస్త్రవేత్తలు రవికుమార్‌, ఎం శ్రీనివాస్‌, ఉదయ్‌కుమార్‌, శ్రీకాంత్‌, ప్రతాప్‌రెడ్డి వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కాలానుగుణంగా బోధనలో మార్పు

- బీసీ గురుకులాల సొసైటీ రాష్ట్ర కార్యదర్శి సైదులు
- వర్గల్‌ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సు



సావనీర్‌ను విడుదల చేస్తున్న సైదులు, తదితరులు

వర్గల్‌(గజ్వేల్‌): డిజిటల్‌ టెక్నాలజీ వినియోగం ద్వారా బోధన కొత్త పుంతలు తొక్కుతోందని, కాలానుగుణంగా బోధనలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని బీసీ గురుకులాల సొసైటీ రాష్ట్ర కార్యదర్శి బీ.సైదులు అన్నారు. బుధవారం వర్గల్‌ జ్యోతిబా పూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్‌ డిపార్ట్‌మెంట్‌, స్టేట్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ హయ్యర్‌ ఎడ్యుకేషన్‌ సంయుక్తంగా బోధనలో డిజిటల్‌ టెక్నాలజీ వినియోగం, సవాళ్లు అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పటి బోధన తీరు, ప్రస్తుత బోధన బేరీజు వేసుకుంటే ఈ విషయం స్పష్టమవుతుందన్నారు. అభివృద్ధి చెందుతున్న డిజిటల్‌ టెక్నాలజీలో భాగంగా కృత్రిమ మేధస్సు, మెషిన్‌ లెర్నింగ్‌, ప్రొజెక్టర్‌ మొదలైనవి బోధనలో భాగమవుతున్నాయన్నారు. సదస్సుకు సంబంధించిన సావనీర్‌ను ఆయన విడుదల చేశారు. కంప్యూటర్‌ సైన్స్‌ డిపార్ట్‌మెంట్‌ అధ్యాపకులు డాక్టర్‌ రాధారాణి, డాక్టర్‌ నిఖిత రూపొందించిన కళాశాల వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఇన్ఫోసిస్‌ సంస్థ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న 70 మంది విద్యార్థినులకు సర్టిఫికెట్లు, పుస్తకాలు అందజేశారు. ఇంగ్లిష్‌ డిపార్ట్‌మెంట్‌ అధ్యాపకులు డాక్టర్‌ షహానా నజనీన్‌, టీ.జయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో 24 మంది భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ జీ.భాస్కర్‌రావు, ఆర్సీఓ ప్రభాకర్‌రావు, వీపీ గోవిందరావు, స్కూల్‌ ప్రిన్సిపాల్‌ లక్ష్మీదేవి, ఓయూ ప్రొఫెసర్లు టీ. మృణాళిని, సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సీహెచ్‌ ప్రసాద్‌, కామర్స్‌ అండ్‌ బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌ శాఖాధ్యక్షులు, అసోసియేట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ గోపాల సుదర్శన్‌, ములుగు ఫారెస్ట్‌ కాలేజీ రీసెర్చ్‌ సెంటర్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ వెంకటేశ్వర్లు, ఇష్లా ఇంగ్లిష్‌ శాఖ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ రాజు నాయక్‌, కళాశాల ఏటీపీ కె.భాగ్యలక్ష్మీ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



వెంకటరమణ మృతదేహం

వెల్దుర్తి(తూప్రాన్‌): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని శెట్టిపల్లికలాన్‌ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నవతగౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా వడ్లమూర్‌ గ్రామానికి చెందిన భార్యాభర్తలు కాళిదాసు భాగ్యలక్ష్మి, వెంకటరమణ (40) మండలంలోని శెట్టిపల్లికలాన్‌ శివారులోని ఓ వ్యవసాయ పొలం వద్ద మూడు నెలలుగా పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి మద్యం విషయంలో భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవ జరిగింది. గది నుంచి బయటకు వెళ్లిన వెంకటరమణ కొద్ది సేపటికి వారు పనిచేస్తున్న పొలం వద్దే నురగలు కక్కుతూ కింద పడి ఉండడాన్ని భార్య గమనించింది. వెంటనే చుట్టుపక్కల వారి సాయంతో మెదక్‌లోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా వెంకటరమణ(40) అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. కుటుంబ ఆర్థిక పరిస్థితి దృష్టిలో ఉంచుకొని మద్యం తాగడం మానుకోవాలని చెప్పినందుకు భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య భాగ్యలక్ష్మి బుధవారం ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉరి వేసుకొని..



మౌలానా మృతదేహం

మిరుదొడ్డి(దుబ్బాక): ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఖాజీపూర్‌లో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, భూంపల్లి ఎస్‌ఐ రవికాంత్‌ రావు కథనం మేరకు.. మండల పరిధిలోని ఖాజీపూర్‌కు చెందిన మహ్మద్‌ మౌలానా (30) భవన నిర్మాణ మేస్త్రీగా పనులు చేస్తూ భార్య, తొమ్మిదేళ్ల లోపు ముగ్గురు పిల్లలను పోషించుకుంటున్నాడు. మౌలానా మద్యానికి బానిసై తరచూ ఇంట్లో గొడవలు పడుతుండేవాడు. మంగళవారం మధ్యాహ్నం గొడవ పెట్టుకున్న మౌలానా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో పిల్లలతో కలిసి భార్య బీబీ పక్కనే ఉంటున్న తన తల్లిగారి ఇంట్లో నిద్రపోయింది. బుధవారం తెల్లవారు జామున మౌలానా తన రేకుల ఇంట్లోనే చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య బీబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..

తూప్రాన్‌: పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివానందం వివరాల ప్రకారం.. మండలంలోని మల్కాపూర్‌ గ్రామానికి చెందిన బట్టికాడి రాజాగౌడ్‌(40) ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు తీర్చలేక నిత్యం ఇబ్బంది పడుతుండేవాడు. 2వ తేదీన మంగళవారం గ్రామ సమీపంలో పురుగుల మందు సేవించి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

టిప్పర్‌ బోల్తా

చిన్నశంకరంపేట(మెదక్‌): ప్రమాదవశాత్తు టిప్పర్‌ బోల్తా పడిన ఘటన చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉదయం జంగరాయి ఎల్లమ్మ ఆలయం మలుపు వద్ద వెల్దుర్తి నుంచి గవ్వలపల్లి వైపు వస్తున్న టిప్పర్‌ అదుపుతప్పి పక్కన ఉన్న పంటపొలంలో పడిపోయింది. డ్రైవర్‌కు గాయాలు కాలేదు.

యువతి అదృశ్యం



బాలమణి(ఫైల్‌)

టేక్మాల్‌(మెదక్‌): యువతి అదృశ్యమైన ఘటన టేక్మాల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం ఎస్‌ఐ మురళీ తెలిపిన వివరాల ప్రకారం.. టేక్మాల్‌ మండలం చల్లపల్లి గ్రామానికి చెందిన ఎలమ్మగడ్డ అంజయ్యకు ముగ్గురు కుమార్తెలు. పెద్ద, చిన్న కూతుర్లకు వివాహాలు జరిగాయి. రెండో అమ్మాయి బాలమణి (26) మానసిక స్థితి సరిగా లేకపోవడంతో తల్లిదండ్రుల వద్దనే ఉంటుంది. గత నెల 31న తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికొచ్చారు. ఇంట్లో కూతురు బాలమణి కనిపించకపోవడంతో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. తండ్రి అంజయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మా లోన్‌ డబ్బులు ఇప్పించండి

మహిళా సంఘం సభ్యుల నిరసన



క్రిమిసంహారక మందు డబ్బాలతో మహిళలు

మద్దూరు(హుస్నాబాద్‌): స్వయం సహాయక సంఘం నుంచి నాటి సీఏ జగన్‌ తీసుకున్న రూ.4 లక్షలు తిరిగి ఇప్పించాలని కోరుతూ మద్దూరు ఏపీఎం కార్యాలయంలో సంఘం సభ్యులు వినతి పత్రాన్ని అందించారు. బాధితులు మాట్లాడుతూ.. దూళ్మిట్ట మండల పరిధిలోని కొండాపూర్‌ గ్రామంలో గల అమ్మా మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులకు 2021 జూలై 5న, నాటి సీఏ జగన్‌ రూ.4 లక్షల లోన్‌ ఇప్పించి సొంతానికి వాడుకున్నాడని ఆరోపించారు. ఈ విషయమై గతంలో ఏపీఎం భిక్షపతి క్షేత్రస్థాయిలో విచారణ చేయించి జగన్‌ను సీఏ విధుల నుంచి తొలగించాడని, ఆ సమయంలోనే జగన్‌ డబ్బులు తిరిగి ఇస్తానని తీర్మానం రాసి ఇచ్చాడని తెలిపారు. అయినా ఇంతవరకు డబ్బులు ఇవ్వకపోడంతో బుధవారం కొండాపూర్‌ గ్రామంలోని జగన్‌ ఇంటి ఎదుట క్రిమిసంహారక మందు డబ్బాలు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఏపీఎం కార్యాలయంలో వినతిపత్రం అందించామన్నారు.

కేసులు ఉన్నాయ్‌ అంటూ బెదిరించి

రూ.1.45 లక్షలు కాజేసిన సైబర్‌ నేరగాళ్లు

పటాన్‌చెరు టౌన్‌: నాలుగు రాష్ట్రాల్లో నీ పేరుపై కేసులున్నాయి అంటూ, బెదిరించి సైబర్‌ నేరగాళ్లు రూ.1.45 లక్షలు కాజేసిన ఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్‌కి చెందిన ఓ వ్యక్తికి మార్చి 31వ తేదీన ఫెడెక్స్‌ కొరియర్‌ నుంచి కాల్‌ చేస్తున్నామని, మీకు వచ్చిన కొరియర్‌లో 80 గ్రాముల మత్తు పదార్థాలు, నాలుగు పాస్‌పోర్టులు, ల్యాప్‌టాప్‌ ఉందని చెప్పారు. అదే విధంగా నీ పేరుపై తమిళనాడు, కేరళ, ముంబై, ఆంధ్రప్రదేశ్‌ నాలుగు రాష్ట్రాల్లో కేసులు ఉన్నట్లు చెప్పి భయభ్రాంతులకు గురి చేశారు. బాధితుడు అపరిచిత వ్యక్తి నగదు అడగడంతో రూ.1.45 లక్షలు పంపించాడు. అనంతరం సైబర్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.లక్ష బురిడీ..

పీజేఆర్‌ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి ఫిబ్రవరి 8వ తేదీన ట్రేడింగ్‌ సంబంధించిన మెసేజ్‌ వచ్చింది. లింక్‌ ఓపెన్‌ చేసి తన వివరాలను నమోదు చేశాడు. అపరిచిత ట్రేడింగ్‌ నిర్వాహకులు ఐడీ క్రియేట్‌ చేసి ఇచ్చారు. బాధితుడు నగదు ఆన్‌లైన్‌ ఇన్వెస్ట్‌ చేస్తూ వచ్చి పెట్టిన పెట్టుబడి, లాభాలు ఇవ్వాలని అడుగగా స్పందించలేదు. బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అమీన్‌పూర్‌ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు.

రూ.1.97 లక్షలు పట్టివేత



తూప్రాన్‌: నగదును సీజ్‌ చేసినట్లు చూపుతున్న ఎస్‌ఐ శివానందం

తూప్రాన్‌: ఎన్నికల కోడ్‌ నేపథ్యంలో పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికురాలి వద్ద రూ.లక్ష లభించినట్లు ఎస్‌ఐ శివానందం బుధవారం పేర్కొన్నారు. పట్టణ సమీపంలో బైపాస్‌ మార్గంలో దాబా హోటళ్ల వద్ద తనిఖీ నిర్వహించామన్నారు. మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన గీతా కులకర్ణి వద్ద రూ.లక్ష పట్టుబడినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్‌ చేశామన్నారు.

రూ.97 వేలు

నర్సాపూర్‌: నర్సాపూర్‌ చెక్‌పోస్టు వద్ద బుధవారం రూ.97 వేలు పట్టుకున్నామని ఎస్‌ఐ పుష్పరాజ్‌ తెలిపారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా నర్సాపూర్‌ హైదరాబాద్‌ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టామన్నారు. సంగారెడ్డికి చెందిన దినేష్‌శ్రీవి కారులో రూ.97,300 తీసుకెళ్తున్నాడని, ఆ నగదుకు సంబంధించి ఎలాంటి డాక్యుమెంట్లు లేనందున సీజ్‌ చేశామన్నారు. తనిఖీల్లో సిబ్బంది పాండరి, సురేశ్‌ నాయక్‌, ఏఈ శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారని ఎస్‌ఐ తెలిపారు.

కత్తులతో బెదిరించి నగదు, ఫోన్లు చోరీ

- ముగ్గురిని ఆటోలో ఎక్కించుకున్న డ్రైవర్‌
- దోపిడీ అనంతరం వాహనం నుంచి తోసేసిన వైనం
- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



మోహినొద్దీన్‌ మృతదేహం

కంది(సంగారెడ్డి): ఆటోలో ఎక్కిన ముగ్గురు యువకులను కత్తులతో బెదిరించి డబ్బులు, సెల్‌ ఫోన్లు లాక్కున్నారు. అంతటితో ఆగకుండా ఆటోలో నుంచి తోసేయడంతో ఒకరు మృతి చెందగా, మరొకరి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కంది మండలం మామిడిపల్లి చౌరస్తా సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. రూరల్‌ ఎస్సై వినయ్‌ కుమార్‌ కథనం ప్రకారం.. ఉత్తర్‌ ప్రదేశ్‌కు చెందిన మోహినొద్దీన్‌(25), మహమ్మద్‌ కైఫ్‌, ఇసాక్‌ పటాన్‌చెరు మండలంలోని రుద్రారంలో ఓ సిమెంట్‌ కంపెనీలో పని చేసుకుంటూ అక్కడే రూమ్‌ అద్దెకు తీసుకొని ఉంటున్నారు. ముగ్గురూ కలిసి 2వ తేదీన సంగారెడ్డిలో పని ముగించుకొని రుద్రారం వెళ్లేందుకు జాతీయ రహదారిపై గల జంజం దాబా వద్ద ఆటో ఎక్కారు. ఆటో మామిడిపల్లి చౌరస్తా సమీపంలోకి రాగానే డ్రైవర్‌తోపాటు మరో వ్యక్తి ముగ్గురిని కత్తులతో బెదిరించి డబ్బులు, సెల్‌ ఫోన్లు లాక్కున్నారు. అంతటితో ఆగకుండా మొహినొద్దీన్‌, కైఫ్‌ను ఆటో నుంచి బయటకు తోసేశారు. తీవ్రంగా గాయాలై మొహినొద్దీన్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో యువకుడు కైఫ్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇసాక్‌ అక్కడి నుంచి తప్పించుకున్నాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దారి దోపిడీ..

పటాన్‌చెరు టౌన్‌: పటాన్‌చెరు మండలం లక్డారం చౌరస్తా నుంచి పటాన్‌చెరు వైపు వచ్చేందుకు గుల్భాన్‌ షా అనే వ్యక్తి ఆటో ఎక్కాడు. ఆటో డ్రైవర్‌తో కలిసి మరో వ్యక్తి గుల్భాన్‌ షా నుంచి రూ.15 వేలు తీసుకొని, మార్గమధ్యలో దింపేశారు. బాధితుడు పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.